
నేటి దినపత్రిక
# సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం | 05 జనవరి 2025 | పేజీలు 8

- మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బందే ఆక్రమణదారులు
- అటకెక్కిన గత విచారణ
- చోద్యం చూస్తున్న అధికారులు
- రూ.కోట్ల విలువ గల భూమి కబ్జా




## శాంతినగర్‌లో..
# ఆక్రమణల జోరు !


మాజీ ఎమ్మెల్యే సిబ్బంది నిర్మించిన గృహం


**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆక్రమణకు అడ్డుఆపూ లేకుండా ఉంది. రోడ్డు, తిప్ప, వాగు పోరంబోకు స్థలాలు యధేచ్ఛగా ఆక్రమించుకొని పెద్ద పెద్ద నిర్మాణాలు చేయడం తెలిసిందే. కాగా మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ వద్ద మూడేళ్ళుగా యధేచ్ఛగా ఆక్రమణల పర్వం సాగుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులే ఆక్రమణదారులకు అండగా ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. 2022లో ఈ ఆక్రమణల పర్వం గురించి **'మేజర్‌న్యూస్'** ప్రచురించగా.. అప్పటి ఆర్డీవో చైత్ర వర్షిణి స్పందించి 20 మంది సిబ్బందిని నియమించి సర్వే చేయించి నివేదికలు తెప్పించారు. అక్కడ గతంలో 116 ప్లాట్లతో పభుత్వం లేఅవుట్ వేసి దాదాపు 70 మందికి పట్టాలిచ్చారని చెబుతుండేవారు. లేఅవుట్‌కు అవతల కూడా స్థలాలుండేవి. కాగా 12 మంది మున్సిపల్ సిబ్బంది శాంతనగర్ లేఅవుట్‌కు అవతల స్థలాలు ఆక్రమించుకొని చిన్న పాటి రేకుల ఇళ్ళు నిర్మించారు. వారిలో ఒక్కరు మాత్రమే అర్హులని, మిగతా వారు పట్టాలిచ్చేందుకు కూడా అర్హులు కాదంటూ ఆర్డీవో నిర్ధారించగా, తహసిల్దారు వారికి నోటీసులు కూడా ఇచ్చారు. అయినా వారు ఖాతరు చేయకపోగా, వాటిని తొలగించే చర్యలు చేపట్టలేదు. అనంతరం క్రమేణా అక్కడ మాజీ ఎమ్మెల్యే సిబ్బంది, మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది స్థలాలను ఆక్రమించుకున్నారు. కొందరైతే రెండేసి, మూడేసి స్థలాలు కూడా ఆక్రమించుకున్నారని, కొందరు విక్రయించారని పలవురు చెబుతుంటారు. ఈ విషయమై అధికారుల దృష్టికి వెళ్ళినా.. పట్టించుకోలేదని పలువురు చర్చించుకుంటుండగా, అధికారులు విచారణ జరిపినా.. ఎలాంటి చర్యలు లేవు. కోట్లాది రూపాయల విలువ గల ప్రభుత్వ

-మిగతా 2లో

# అవినీతిపై ప్రశ్నిస్తే కేసులా..

**పోలీసులే నేరస్తులుగా మారారు : మాజీ మంత్రి కాకాణి ధ్వజం**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

కూటమి ప్రభుత్వంలో అవినీతిపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం నెల్లూరు నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ మందల శేషయ్య అరెస్టులో పోలీసులు న్యాయస్థానానికి తప్పుడు పత్రాలు ఇచ్చినట్టు నెల్లూరు జిల్లా పోలీసులపై తీవ్ర విమర్శలు చేశారు. నెల్లూరు జిల్లాలో వెంకటాచలం పోలీసులు మాజీ జెడ్పీటీసీ మందల శేషయ్యపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. వెంకటాచలం సీఐ సుబ్బారావు దారుణంగా వ్యవహరించారని, కోర్టుకు సమర్పించిన స్టాంప్స్‌లో కొత్త స్టాంప్స్‌లో పాత తేదీలతో తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో నేరస్తులను కట్టడి చేయాల్సిన పోలీసులే నేరస్తులులాగా మారారని ఆరోపించారు. శ్రావణి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదులో పోలీసులు పెట్టిన సెక్షన్లు అన్నీ తప్పులేనన్నారు. శేషయ్యపై పోలీసులు పెట్టిన రిమాండ్ రిపోర్ట్ ప్రకారం రిమాండ్ కరెక్ట్ కాదని, పోలీసులు ఇచ్చిన ఆధారాలు సరిపోవని స్వయంగా న్యాయమూర్తి తిప్పి పంపారని చెప్పారు. పోలీసులు న్యాయమూర్తికి సమర్పించిన పత్రాలు తప్పుడు పత్రాలు రెండేళ్ల క్రితం

-మిగతా 2లో



పల్లెసీమ మంచంపట్టింది.. పల్లె కన్నీరు పెడుతుంది.. వైద్యం అటకెక్కింది.. విషజ్వరాల వలయంలో పల్లెసీమ విలవిలాడుతోంది.. అతలాకుతల మవుతున్న పల్లెసీమను ఆదుకునేదెవరా.. అని పల్లె ప్రజలు ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. గడిచిన 20 రోజుల్లో 8 మంది మృత్యువాతపడ్డారు. అయినా అధికార గనం జాడ కానరాలేదు. *- జలదంకి, మేజర్‌న్యూస్ :*

# మంచం పట్టిన పల్లెసీమ

**జలదంకి, మేజర్‌న్యూస్ :**

జలదంకి మండలంలోని అన్నవరం గ్రామం ప్రస్తుతం విషజ్వరాలతో అతలాకులమవుతోంది. ఈ సమస్య గత కొన్ని రోజులుగా తీవ్రతరమవుతూనే ఉంది. ప్రభుత్వం వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, వైద్య అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించకపోవడం వల్ల గ్రామాల్లోని ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఎప్పుడు లేనివిధంగా ఈ ఏడాది వర్షాలు అధికంగా రావడంతోపాటు వాతావరణ మార్పులు నెలకొన్నాయి. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. అందులో ప్రధానంగా జలదంకి మండలంలోని అన్నవరం గ్రామంలో విషజ్వరాలు బాధితులు ఎక్కువగా ఉన్నారు. విష జ్వరాలు కారణంగా గడిచిన 20 రోజుల్లో ఒక్క అన్నవరం గ్రామంలోనే 8 మందికి పైగా మృత్యువాత చెందారు. మరి కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సాధారణంగా గ్రామాల్లోని కాలనీలు, పల్లెలపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో దుర్గంధభరితమైన మురుగుతో దోమలు విలయ తాండవం చేస్తుంటాయి. అయితే ఇక్కడ అన్నవరం గ్రామంపై పంచాయతీ పాలకులు కానీ, వైద్య సిబ్బంది కానీ

-మిగతా 2లో



- విష జ్వరాల విలయం
- మృత్యువాత పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

## వన్‌మాన్ కమిషన్‌కు
# అర్జీల వెల్లువ

- ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై అర్జీలు స్వీకరించిన చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా
- ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా అర్జీలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ఎస్సీ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి విజ్ఞప్తులను స్వీకరించినందుకు నెల్లూరుకు విచ్చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఎస్సీ ప్రజలు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో అర్జీలు అందజేశారు. శనివారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై జిల్లా కలెక్టర్ ఆనంద్, అధికారులతో కమిషన్ చైర్మన్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్సీ ప్రజలు, సంఘాల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. పలువురు కుల సంఘాల నేతలు

-మిగతా 2లో

# డొక్కా సీతమ్మ భోజన పథకం.. ఓ బృహత్తర కార్యక్రమం

## రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వీఆర్ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని నెల్లూరు నగర మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రారం భించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం ప్రారంభించారని, దీనిలో భాగంగా నెల్లూరు నగరంలోని వీఆర్ మున్సిపల్ కాలేజీలో కూడా ఈ పథకాన్ని ప్రారంభించామని విద్యార్థులకు మధ్యాహ్నం పూట నాణ్యమైన ఆహారం అందించే విధంగా మంచి మెనూతో ప్రణాళికలు రూపొందించామని, నేటి విద్యార్థులే రేపటి పాలకులు కాబట్టి.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ 2047లో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు పౌష్టికరమైన ఆహారం అందించడం ద్వారా మానవ వనరులను పెంచేందుకు కృషి చేస్తున్నామని నగర కమిషనర్ సూర్యతేజ తెలియచేశారు. రాష్ట్ర వక్స్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 44 వేలకు పైగా ఉన్న పాఠశాలలు,కళాశాలలో 33 లక్షలు కు పైగా విద్యార్థిని విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పేరుతో నాణ్యమైన ఆహారం అందించేందుకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

# వన్‌మాన్ కమిషన్‌కు అర్జీల వెల్లువ

*(మొదటి పేజీ తరువాయి)*



తమ అభిప్రాయాలను కమిషన్ చైర్మన్ ఎదుట వ్యక్తం చేశారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు అనుకూలంగా, వ్యతిరేకంగా అర్జీలు అందజేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని, వెనుకబాటుతనానికి అది పరిష్కారం చూపదని కొందరు అర్జీలు అందజేశారు. ఎస్సీలు ఐక్యంగా ఉండాలని, కులగణన పక్కాగా చేపట్టాలని పలువురు కోరారు. ప్రైవేటు సంస్థల ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, క్రిమిలేయర్ సమ్మతం కాదని అర్జీలు అందజేశారు. వర్గీకరణ త్వరగా పూర్తి చేయాలని, రెండు కులాలు ఐక్యంగా కలిసి ఉండడం లేదని కుల సంఘాల నాయకులు కమిషన్‌కు వినతి పత్రాలు అందజేశారు. సుప్రీంకోర్టు తీర్పును తాము వ్యతిరేకిస్తున్నామని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కే కట్టుబడి ఉండాలని కోరారు. 2021 జనాభా లెక్కలను సమగ్రంగా లెక్కించి కులగణన చేపట్టాలని పలువురు నాయకులు కమిషన్ చైర్మన్‌కు వివరించారు. మొత్తం 363 అర్జీలను కమిషన్ చైర్మన్‌కు అందజేశారు. దళిత క్రిస్టియన్లను కూడా ఎస్సీలుగా ప్రకటించాలని కోరారు. 85 శాతం మంది మాలలు ఉద్యోగులుగా ఉంటే, కేవలం 15 శాతం మాత్రమే మాదిగలు ఉద్యోగులుగా ఉన్నారని, వెంటనే వర్గీకరణ చేపట్టాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో నియమించిన కమిషన్లు అన్నీ కూడా వర్గీకరణకు అనుకూలంగానే తమ నివేదికలు అందించాయని కూడా చైర్మన్‌కు కుల సంఘ నేతలు విన్నవించారు. వర్గీకరణను అడ్డుకోవడం మంచిది కాదన్నారు. నెల్లూరు జిల్లాలో ఎస్సీల్లో లేని కులాలను పరిగణలోకి తీసుకోవద్దని కోరారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టడంతో చాలా మంది లబ్ధి పొందారని, అనంతరం దీనిని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం నిలుపుదల చేశారని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎఎస్పీ సౌజన్య, డీఆర్ఓ ఉదయ్‌భాస్కర్, కమిషన్ జిల్లా పర్యటన లైజనింగ్ అధికారి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి పాల్గొన్నారు.



# మంచం పట్టిన పల్లెసీమ




*(మొదటి పేజీ తరువాయి)*

అటువైపు చూడకపోవటం, పారిశుద్ధం చేయకపోవడంతో విష జ్వరాలు బారినపడి 8 మందికి పైగా మృతి చెందారు. మరి కొంత మంది పరిస్థితి విషమంగా ఉండటంతో గ్రామ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇదిలాగే కొనసాగితే.. ఎంత మంది మృత్యు వాత పడతారో ! అని గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అన్నవరం గ్రామంలో చిన్న,పెద్దా అని తేడా లేకుండా శరీరంపై దద్దులు రావడం, కీళ్ల నొప్పులు, తీవ్రంగా ఒళ్ళు నొప్పులు, తల నొప్పి, గొంతు నొప్పి, కొందరు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. స్థానికంగా సచివాలయ వైద్య సిబ్బంది గ్రామంలోని ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉండగా.. సంబంధిత ఏఎన్ఎం గ్రామంలో తిరిగిన పాపాన పోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



### గ్రామం వైపు కన్నెత్తి చూడని వైద్యాధికారులు..

గత 20, 30 రోజులుగా అన్నవరం గ్రామంలో విష జ్వరాలు విలయతాండవం చేస్తూ.. ప్రజలు మృత్యువాత బారినపడుతున్నారు. జలదంకి మండలంలోని గట్టుపల్లి వైద్యశాలలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ ఇంతవరకు ఆ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడలేదని అన్నవరం గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. విషజ్వరాలతో గట్టుపల్లి వైద్యశాలకు వెళ్తే.. వైద్యులు కానీ, వైద్య సిబ్బంది కానీ అందుబాటులో ఉండటం లేదని, అందుబాటులో ఉన్నప్పుడు వైద్యురాలు నిర్లక్ష్య సమాధానం చెబుతోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి వైద్యాధికారులు స్పందించి.. అన్నవరం గ్రామంలో పర్యటించి వైద్య సేవలు అందించడంతోపాటు ప్రజలతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నవరం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## అవినీతిపై ప్రశ్నిస్తే కేసులా...

*(మొదటి పేజీ తరువాయి)*

పత్రాలు ఇచ్చినట్టు చూపారని, కానీ అవన్నీ 15 రోజుల క్రితం సృష్టించినవన్నారు. శేషయ్య అరెస్టు సమయంలో అత్తమామలు ఇంట్లో ఉన్నారని చూపారని, కానీ మాజీ మంత్రిగా నేను స్వయంగా అక్కడకు వెళ్లి చూసానని, కానీ అక్కడ శ్రావణి అత్తమామలు అనే వారు లేరన్నారు. మేము, మా కోడలతో లేము.. ఆసుపత్రిలో ఉన్నామని శ్రావణి అత్త మామలు స్వయంగా స్టేట్‌మెంట్ ఇచ్చారని వివరించారు. సీఐ, ఆర్ఐ, ఈఆర్ఓలు అందరితోపాటు ఉద్యోగస్తురాలు శ్రావణి అందరూ అక్రమ కేసు పెట్టినందుకు బాధపడక తప్పదన్నారు. సోమిరెడ్డిని ప్రశ్నించినందుకు శేషయ్యను అక్రమ కేసుల్లో ఇరికించారని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా ఎస్పీ ఏమీ తెలియదనట్లు ఉన్నారని పేర్కొన్నారు. ఎంత ఉప్పు తింటే.. అన్ని నీళ్ళు తాగుతారని అందరిచేత అన్నీ కక్కిస్తానన్నారు. భవిష్యత్తులో నన్ను జైల్లో ఉంచినా.. అక్కడ నుంచే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

## శాంతినగర్‌లో ఆక్రమణల జోరు




*(మొదటి పేజీ తరువాయి)*

స్థలాలను యధేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. అదీగాక మున్సిపల్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది ఆక్రమించుకున్నా.. నిర్మాణాలు సాగిస్తున్నా.. బినామీ పేర్లు అని ప్రచారం జరుగుతున్నా.. అధికారులు మాత్రం ఏమాత్రం స్పందించకుండా చోద్యం చూస్తున్నారు. ఇంతగా విచ్చలవిడి ఆక్రమణల పట్ల అధికార యంత్రాంగం స్పందించకపోవడం పలు సందేహాలకు తావిచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇంతటి దోపిడీ వ్యవహారం ఆత్మకూరులో సాగుతుందని, మరెక్కడా ఇలాంటి విచ్చలవిడి పరిస్థితి ఉండబోదని, ప్రభుత్వంలోని వారే విపరీతంగా ఆక్రమించుకోవడం, అత్యంత విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఖచ్చితంగా వ్యవహరించే ఆత్మకూరు ఆర్డీవో స్పందించి సమగ్రంగా విచారణ, సర్వే చేయిస్తే వాస్తవాలన్నీ వెల్లడికాగలవని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. మరి చర్యలకు పూనుకుంటారేమో చూడాల్సి ఉంది.

## జిల్లా సమగ్ర అభివృద్దే నా లక్ష్యం

### నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాను ప్రజలు ఏవిధంగా చూడాలనుకుంటున్నారో.. దానికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించి.. అభివృద్ధి చెయ్యబోతున్నట్లు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వైస్ చైర్మన్ సూర్యతేజతో కలిసి.. నుడా అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. 2041 టార్గెట్‌గా నుడా పరిధిలో ఎక్కడెక్కడ పరిశ్రమల స్థాపన, రోడ్లు, డ్రైనేజీ వంటి వసతుల కల్పనకు మాస్టర్ ప్లాన్ అవసరం ఉంటుందన్నారు. మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి.. తద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని కోటంరెడ్డి తెలిపారు. తాను నుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు పార్కుల అభివృద్ధి దగ్గర నుంచి నెక్లెస్ రోడ్డు నిర్మాణం దాకా అన్నీ కూడా నుడా ఆధ్వర్యంలోనే జరిగాయన్నారు. మరోసారి అభివృద్దే అజెండాగా పనిచేయబోతున్నట్లు స్పష్టం చేశారు. మాస్టర్‌ప్లాన్ ఆధారంగా రింగ్‌రోడ్లు, బైపాస్ రోడ్లు, ప్రధాన నీటి సరఫరా, పార్కుల అభివృద్ధి వంటి వాటికి పెద్ద పీటవేస్తామన్నారు. మాస్టర్ ప్లాన్‌ను త్వరితగతిన ఇవ్వమని ఇప్పటికే.. ఆర్.వి కన్సల్టెన్సీని కోరామన్నారు. వైస్ చైర్మన్ సూర్య తేజ మాట్లాడుతూ.. తీర ప్రాంత జిల్లా కావడంతో, దాని సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నామన్నారు. చైర్మన్ కోటంరెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నుడా పరిధిలోని కమిషనర్లు, కార్పొరేషన్ అధికారులు, సిటీ ప్లానర్ హిమబిందు, నుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు సమయపాలన పాటించాలి : డీఎం అండ్ హెచ్ఓ




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యాధికారులు ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశలో ఆమె మాట్లాడుతూ.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ క్రింద పని చేస్తున్న ప్రతి అధికారి, సిబ్బంది అందరూ వారికి కేటాయించిన సమయం ప్రకారం తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు ఎఫ్ఆర్ఎస్ వేయవలసిందిగా ఆదేశించారు. ముఖ ఆధారిత హాజరు వేయని వారికి, సమయపాలన పాటించని వారికి జీత భత్యాలు నిలుపుదల చేయబడునని హెచ్చరించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు పక్కగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాలు నూరుశాతం సాధించే దిశగా అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అవి క్షేత్ర స్థాయిలో సంపూర్ణంగా అమలయ్యేలా పర్యవేక్షించ వలసినిదిగా అధికారులను ఆదేశించారు. ఎన్‌సిడి స్క్రీనింగ్ క్రింద ప్రతి ఏఎన్ఎం /ఎంఎల్‌హెచ్‌పీ ప్రతి రోజు 5 ఇండ్లను కచ్చితంగా స్క్రీనింగ్ చేయాలని, రాబోయే ఒక వారం లోపు నిర్దేశించిన లక్ష్యం సాధించవలసిందిగా ఆదేశించారు. అనంతరం డీఎల్ఎటిఓ షేక్ ఖాదర్ వలి మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ నుంచి జరగబోయే కుష్టు వ్యాధి గ్రస్తులు గుర్తింపు సర్వే (ఎల్‌సిడిసి) ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని, క్షయ అనుమానితులను గుర్తించి గళ్ళ పరీక్షలు లక్ష్యం మేరకు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. డిఐఓఏ ఉమా మహేశ్వరి మాట్లాడుతూ.. పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాల పట్టిక ప్రకారం సకాలంలో అన్నీ రకాల వ్యాక్సిన్లు ఇచ్చే లాగా, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో జరిగే వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం ఎఫ్‌పీసి నోడల్ ఆఫీసర్ డాక్టర్ పిఎల్ దయాకర్, కావలి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పి.బ్రిజిత, డిపిఎంఓ డాక్టర్ ఎం.రమేష్‌లు వారి వారి ప్రోగ్రాంలను సమీక్షించారు. సమీక్ష సమావేశంలో కందుకూరు ఇన్‌చార్జ్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్ రజని, డాక్టర్ వై.యశ్వంత్, డెమో కె.కనక రత్నం, డిపి హెచ్ఎన్ఓ జి.మంజుల, ఎస్ఓ కె.సహన, డిపిఓ కె.రమేష్ వివిధ పీహెచ్‌సి యుపీహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

# సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభోత్సవం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూరు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అనంతరం ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించి ప్రతి విద్యార్థికి విద్యతోపాటు, పౌష్టికాహారాన్ని అందించే మంచి కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో తీసుకువచ్చిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని, గత వైసీపీ ప్రభుత్వం తొలగించింది. అయితే నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం నేడు విద్యశాఖ మంత్రిగా తిరిగి మరల డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, టీడీపీ నాయకులు రాపూరు శేఖర్, పముజుల గోపాలయ్య, అన్నం సుధాకర్ గౌడ్, సౌత్ మోపూర్ నీటి సంఘం చైర్మన్ తుళ్లూరు రామయ్య, భాస్కర్, సౌత్ మోపూర్ నీటి సంఘం వైస్ చైర్మన్ అశోక్, వెంకయ్య, వెంకటేశ్వర్లు, తిప్పన కామాక్షయ్య, నరసయ్య, సుధాకర్, పముజుల రాజేష్, సునీల్, విజయ్ భారత్, రాపూరు రవి, డి.వెంకటేశ్వర్లు, వెలసిరి మస్తాన్, గిరి, శివ, వంగపూడి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో రెండు గుడిసెలు దగ్ధం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు గుడిసెలు దగ్ధమైన ఘటన మండలంలోని అన్నారెడ్డిపాలెం గిరిజన కాలనీలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు ఎస్టీ కాలనీకి చెందిన ఆడిపూడి శైలజ పూరింట్లో ఉన్న విద్యుత్తు మీటర్ వద్ద మంటలు చెలరేగడంతో తొలుత ఆమె ఇంటికి నిప్పు అంటుంది. అనంతరం ఆమె తండ్రి గడ్డం బ్రహ్మయ్య ఇల్లు కూడా సమీపంలో ఉండటంతో గాలులకు అతని ఇంటికి కూడా నిప్పు అంటుకుంది. దీంతో క్షణాల వ్యవధిలోని రెండిళ్లకు పూర్తి స్థాయిలో నిప్పు అంటుకోవటంతో మంటలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో ఇరు కుటుంబాలకు చెందినవారు ఆరు బయట కూర్చొని ఉండటంతో ప్రమాదం తప్పింది. తమ ఇళ్లకు మంటలు వ్యాపించాయని గుర్తించిన వారు పెద్దగా కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని మంటలపై నీళ్లు చల్లి అదుపు చేశారు. అనంతరం ఈ విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకుడు సింహాద్రి అయ్యప్ప ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న 5000 రూపాయల నగలతో పాటు వస్తువులన్నీ పూర్తిగా బూడిదమయం కావడంతో బాధితులు కట్టు బట్టలతో మిగిలారు.

## జీఎంకె ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వెట్టర్లు పంపిణీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం గ్రామంలో గ్రామానికి చెందిన జీఎంకె ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత మండల ఉపాధ్యక్షులు గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి అంద జేసిన స్విట్జర్లను శనివారం ఆయన నివాసగృహంవద్ద ట్రస్ట్ ప్రతినిధులు గ్రామంలోని ప్రతి కుటుంబానికి స్వెట్జర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలికాలాన్ని, చలితీవ్రతను దృష్టిలో వుంచుకుని ట్రస్ట్ అధినేతగ్రామంలోని అన్నీవర్గాలవారికి సుమారు రూ.3లక్షలు విలువ చేసే 800 స్వెట్టర్లు పంపిణీచేసి తన దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయ మన్నారు.ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు చేపడుతు న్నారన్నారు. గతంలో ట్రస్ట్ ద్వారా ప్రాథమిక, ఉన్నతపాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు బుడం గుంట్ల, వెంకటేశ్వర్లు, పాముల. రాజా, అన్నాబత్తిన మాధవ, స్థానికులు రాపల్లి, తిరుపతి, గొల్లపల్లి, రమేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రేయిలీ డే వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలని దళిత వాడ ప్రాథమిక పాఠశాల్లోని భవితా కేంద్రంలో లూయి బ్రేయిసీ దినోత్సవ వేడకలు శనివారం హెచ్ఎం షబ్బీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లూయి బ్రేయిలీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంధులు చదువుకోవడం కోసం బ్రేయిలీ లిపి ద్వారా అవకాశం కల్పించారన్నారు. ఫలితంగా ఎంతోమంది ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థానాల్లో ఉన్నారన్నారు. మహనీయులను ప్రతి ఒక్కరు గుర్తుంచుకుని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసిహా, ఐఆర్పీలు శివనందిని, సుభాష్ చంద్ర బోస్, అంగన్వాడీ సిబ్బంది సంజీవరాణి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గండిపాలెంలోపిచ్చి కుక్క స్వైర విహారం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాలెం గ్రామంలో రోజురోజుకు కుక్కలబెడద ఎక్కువై పోవడంతో ప్రజలు ఇండ్లలోనుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రోడ్లపై విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తుండడంతో పాదాచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన షేక్. జానీబాషమోటరు వేసేందుకు వెళ్లగా పిచ్చికుక్కకాటువేసింది. చికిత్సకోసం స్థానిక పీహెచ్సీకి వెళ్లగా అక్కడ కుక్క దాడిచేసి తొమ్మిది కాట్లు వేసి తీవ్రంగా గాయపరచింది. స్థానికులు గమనించి కుక్కను తరిమికొట్టారు. వైద్యసిబ్బంది అతనికి చికిత్స అందించారు.

## మధ్యాహ్నభోజన పథకం ప్రారంభం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం ప్రభుత్వం విద్యార్థుల సౌక ర్యార్థం ఏర్పాటుచేసిన మధ్యాహ్నభోజన పథకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్ రిబ్బన్ కట్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ భోజన పథకం కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు కలాశాల్లో ప్రతి రోజు భోజనం చేయాలన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన, నాన్యమైన భోజనం అందంచడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.బాలకేశవులు, నాయకులు బయన్న, రియాజ్, బి.నరసింహులు, జి.వెంకటేశ్వర్లు, ఎన్.నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## పర్వత రెడ్డికి శుభాకాంక్షల వెల్లవ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున ఆధ్వర్యంలో శనివారం 13వ డివిజన్ నుంచి 50మంది కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం లో అంతా మేలు జరిగి.చంద్రశేఖర్ రెడ్డి రాజకీయంగా మరింత అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు.

# కొత్త ఏడాది తీర్మానం.. సైబర్ నేరాల అంతం : ఏపీఎం చిన్నయ్య

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సైబర్ మోసం! ప్రాంతమేదైనా అంతటా దీనిపైనే చర్చ అని,కొత్త ఏడాదిలో సైబర్ నేరాల అంతమే లక్ష్యం అందరూ సమిష్టిగా ప్రజల్లో అవగాహన కల్పించాలని పొదలకూరు వెలుగు ఏపీఎం చిన్నయ్య, టీడీపీ తిరుపతి పార్లమెంట్ రైతు సంఘం ఉపాధ్యక్షులు పులిపాటి వెంకటరత్నం నాయుడు అన్నారు. శనివారం మండలంలోని పులికల్లు గ్రామంలో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం చిన్నయ్య, టీడీపీ సీనియర్ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ.. ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఏపీకే ఫైల్స్ డౌన్లోడ్ చేసుకుని ఇంస్టాల్ చేయమనే మెసేజుల తో అప్రమత్తంగా ఉండాలన్నారు. సులభంగా లోన్ పొందవచ్చుననే లింకులు నొక్కి అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దన్నారు. మీరు కుడా ఎంతో తేలికగా ఆ గేమ్ ఆడి డబ్బులు సంపాదించవచ్చు అనే ప్రకటనలు చూసి.. మోసపోవద్దన్నారు. ఈ




కార్యక్రమంలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవల పై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ పోస్టర్లు ప్రదర్శించారు. పులికల్లు క్లస్టర్ సీసీ శ్రీనివాసులు, దయాకర్ మాట్లాడుతూ.. పొదుపు అవసరం, సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవలను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ట్రీస్ కార్యదర్శి షేక్. అహ్మద్, రిసోర్స్ పర్సన్ ఎ.చంద్రశేఖర్, ఈ కార్యక్రమంలో వెలుగు వీఏఓ కౌసల్య, బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

# జిల్లా వైసీపీ అధికార ప్రతినిధిగా శివప్రసాద్

## ● హర్షం వ్యక్తం చేసిన పార్టీ కార్యకర్తలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మాజీ జెడ్పిటిసి అయినటువంటి నెల్లూరు శివప్రసాద్‌కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆ పార్టీలో ప్రాధాన్యత కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా వైకాపా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆయన నియామకాన్ని శనివారం ధృవీకరించారు. ఈ సందర్భంగా వైకాపా పార్టీ కార్యకర్తలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. బీసీ వర్గానికి చెందిన నెల్లూరుకు ఈ పదవి ఇవ్వడం పట్ల సామాజిక వర్గాలు కూడా హర్షం వ్యక్తం చేసినవి. ఈ తరుణంలో పార్టీ అధిష్టానానికి నెల్లూరు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

# సచివాలయాలను పరిశీలించిన ఆరోగ్య అధికారి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్థానిక 28వ డివిజన్ పరిధిలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య 28/2, 28/3 వార్డు సచివాలయాలను శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని అటెండెన్స్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సచివాలయాల పరిధిలో వ్యర్థాలను ఇంటింటి నుంచి సేకరించేందుకు మరో వాహనం కావాలని, డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కార్పొరేటర్ కోరారు. త్వరతగతిన సమస్యల్ని పరిష్కరిస్తామని ఆరోగ్యశాఖ అధికారి తెలియజేశారు. అదేవిధంగా 28 డివిజన్ పరిధిలోని పాడుబడిన ప్రభుత్వ క్వార్టర్స్ దగ్గర ఫ్లోర్ పాయింట్‌గా ఏర్పడిందని అన్ని విభాగాల సమన్వయంతో సమస్యను పరిష్కరిస్తామని డాక్టర్ తెలియజేశారు.

# ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలు జరిగాయని వాటిపై చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వంలో అధికారులకు విన్నవించడం జరిగిందని 54వ డివిజన్ టిడిపి నాయకుడు ఈశ్వర్ తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెంకటేశ్వరపురం, భగత్ సింగ్ కాలనీలలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురై ఉన్నాయని కొంతమంది ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి బాడుగలకు ఇచ్చి పేదల నుండి లక్షలు వసూలు చేసుకుంటున్నారని ఆ స్థలాలను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వము వెంటనే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ద్వారా విచారించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. వెంకటేశ్వరపురం లో జరుగుతున్న భూకబ్జాలపై మంత్రి నారాయణ స్పందించి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటేశ్వర పురంలో కబ్జాకు పాల్పడుతున్న స్థానిక కార్పొరేటర్ పై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

# కొండ బిట్రగుంట దేవస్థానంలో విదేశీ ప్రేమ జంటకు వివాహం

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనివారం కావలి వాస్తవ్యులు అఖిల్ శ్రీనివాస్, ప్యారిస్ దేశ వాస్తవ్యులు చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి అలిసన్ వివాహం దేవస్థాన ప్రధాన అర్చకులు వీపూరి సత్యనారాయణ ఆచార్యులు చేతులు మీదగా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎ.రాధాకృష్ణయ్య పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ.. విదేశీయులు అయినప్పటికీ దేవస్థానంలో పెళ్ళిచేసుకోవడం అనేది గొప్ప విషయమని పైగా బిట్రగుంట దేవస్థానంలో చేసుకోవడం అనేది ఇంకా మంచిది అని బంధువులు శ్రేయోభిలాషులతోపాటు ఆ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని పెళ్లికి హాజరు అవ్వడం చాలా సంతోషంగా ఉంది అని తెలియజేశారు. అనంతరం ప్యారిస్ మహిళ అయిన అలిసన్ మాట్లాడుతూ తనకి తెలుగు సరిగా రాదు అని అందుకే ఏం మాట్లాడాలో తెలియడం లేదు అని కానీ తనకి కూడా ఇలా దేశం దాటి వచ్చి దేవస్థానం లో పెళ్లి చేసుకోవడం అనేది చాలా నచ్చింది అని తెలియజేశారు.



# వైసీపీ జిల్లా కార్యదర్శిగా కల్లూరి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి శనివారం విడుదల చేసిన పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉదయగిరి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డిని జిల్లా కమిటీలో సెక్రటరీ యాక్టివిటీగా నియమించినందుకు పార్టీని నమ్ముకున్న నాయకులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎప్పుడు విస్మరించాలని నా మీద నమ్మకం ఉంచిన ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డికి యువ నాయకులు మేకపాటి అభినవరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు నాపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యత అప్పగించి రెట్టింపు ఉత్సాహంతో మరల జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేంతవరకు పార్టీకే కష్టపడి పని చేస్తాను అన్నారు.

# విద్యార్థుల మానసిక వికాసానికి ప్రేరణ తరగతులు అవసరం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల మానసిక వికాశానికి ప్రేరణ తరగతులు అవసరం అని మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఏపీ ఆర్ఎస్ గండిపాలెం పాఠశాల నందు వి.నారాయణ రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నందు విద్యార్థులు నూటికి నూరు శాతం మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి ఈ ప్రేరణ తరగతులు ఉపయోగపడతాయని, ఈ



తరగతుల వలన విద్యార్థుల మానసిక వికాసం అభివృద్ధి చెందటంతో పాటు మేము సాధించగలం అనే నమ్మకం, జీవితంలో ముందుకు సాగుటకు నడిసముద్రంలో ఒడ్డుకు చేర్చే నావల ఈ ప్రేరణ తరగతులు ఉపయోగపడతాయని తెలియజేసి ఉదయగిరి మండలంలోని విద్యార్థులు తప్పనిసరిగా జిల్లాస్థాయి ర్యాంకులు సాధించాలని చెప్పారు. ఈ తరగతిలో నందు జిల్లా ఉన్నత పాఠశాలలైన గండిపాలెం, వెంగళరావు నగర్, అప్పసముద్రం, ఏపీ ఆర్ఎస్ గండిపాలెం పాఠశాలలు కలిపి మొత్తం 111 మంది బాలురు, 70 మంది బాలికలు మొత్తం 181 మంది విద్యార్థులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

# ఎమ్మెల్సీని కలిసిన కార్పొరేటర్ కరిముల్లా

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని శనివారం 42వ డివిజన్ కార్పొరేటర్ కరీముల్లా ఆధ్వర్యంలో 42వ డివిజన్ వైసిపి నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మిఠాయిలు తినిపించి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.



# వైద్య సిబ్బందితో ఫీవర్, లార్వా సర్వే..

**జిల్లా మలేరియా అధికారిణి ఈ.హుస్సేనమ్మ**



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని తాటిపర్తి గ్రామం నందు వైద్య సిబ్బందితో కూడిన బృందాల ద్వారా ఫీవర్, లార్వా సర్వే చేసిన గృహాలను తనిఖీ చేసి, జ్వర పీడితులను సందర్శించి వారి యొక్క ఆరోగ్య పరిస్థితులను కనుగొన్నారని జిల్లా మలేరియా అధికారిణి ఈ.హుస్సేనమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారిణి ఈ.హుస్సేనమ్మ మాట్లాడుతూ.. జ్వర పీడితులకు ఎన్‌ఎస్-1, మలేరియా రాపిడ్ కిట్స్ ద్వారా చేసిన పరీక్షలు నెగిటివ్‌గా వచ్చినవి. బ్లడ్ సీరం తీసి డెంగ్యూ పరీక్ష కొరకు జిజిహెచ్ నెల్లూరు ల్యాబ్‌కి పంపించడం జరిగింది. మెడికల్ క్యాంపును సందర్శించి రికార్డులను తనిఖీ చేయడం జరిగింది. గ్రామంలో శానిటేషన్ చాలా పూర్ ఉన్నది. డ్రైనేజ్ నీరు ఎక్కడికి ఎక్కడ బ్లాక్స్ ఉన్నాయి. వీటి గురించి జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడతాను. ఇది గాని క్లియర్ చేస్తే గ్రామంలో జ్వరాలు రావు అని తెలియజేశారు. వైద్య సిబ్బందిని జీరో జ్వరం కేసులు వచ్చేవరకు మెడికల్ క్యాంపును కొనసాగించండి అని ఆదేశించినారు. తరువాత ఎంపీపీ ఈఎల్‌సి స్కూల్‌ను సందర్శించి పిల్లలకు పరిసరాల పరిశుభ్రత గురించి, సీజనల్ వ్యాధులు గురించి, హ్యాండ్ వాష్ గురించి, వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ ఎన్.ఆంజనేయ వర్మ,హెల్త్ సూపర్వైజర్స్ కె.శ్రీనివాసులు, ఎం.నరసమ్మ ఆరోగ్య సహాయకులు ఎం.మహేంద్ర, టి.పెంచలయ్య, సుశీల, ఆశా కార్యకర్తలు మలేరియా అధికారి వెంట ఉన్నారు.

**కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే..**

# జీవితం సుఖమయం అవుతుంది



- పోషక విలువలతో కూడిన ఆహారం విద్యార్థులకు అందిస్తాం
- డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం ఇంటర్ విద్యార్థులకు వరం
- మధ్యాహ్న భోజనం ప్రారంభించిన కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి

**బోగోలు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు తమ లోపాలను సరిదిద్దుకొని కష్టాన్ని ఇష్టంగా మార్చుకుంటే జీవితం సుఖమయం అవుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సరస్వతి దేవి విగ్రహం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వయంగా విద్యార్థులకు అన్నం వడ్డించిన అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు శాసనసభ్యులు. కళాశాలలకు విచ్చేసిన శాసన సభ్యునికి విద్యార్థులు ప్రిన్సిపాల్ అధ్యాపకులు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కళాశాల అకడమిక్ ప్రగతి నివేదికను ప్రిన్సిపాల్స్ వివరించారు. మత్తు పదార్థాల వలన కలిగే హానిని విద్యార్థులకు వివరించారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు లేని విధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న బడి భోజనం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆకలి తీర్చిన అన్నపూర్ణమ్మ మహాతల్లి డొక్కా సీతమ్మ పేరు ఈ పథకానికి పెట్టడం, ఈ పథకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనం అని ఆయన తెలిపారు. ఈ పథకం ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, ఇది ఇంటర్ విద్యార్థులకు ఒక వరమని అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, మంచి చేసే ప్రభుత్వమని, విద్యా వికాసం కోసం చర్యలు తీసుకునే ప్రభుత్వమని తెలిపారు. విద్యార్థుల ఆకలి తీర్చడం ఒక్కటే లక్ష్యం కాదని, రుచికరమైన, ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం తమ ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేదవాడు ఉన్నత స్థాయికి ఎదగాలని, పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని, శారీరక దృఢత్వం, మానసిక పరిపక్వత చెందాలని యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ పథకం రావడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాల వైపు వెళ్ళొద్దని, క్షణికానందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. విద్యార్థులు ఇంటర్ నుండి మరో 5 సంవత్సరాలు కష్టపడి చదివితే జీవితాంతం ఆనందంగా ఉండవచ్చునని తెలిపారు. ఈ సమయంలో కష్టపడితే జీవితం ఆనందమయం అవుతుందని అదే ఇప్పుడు మనం సంతోషాల కోసం సమయం వృధా చేస్తే జీవితం కష్టాల పాలవుతుందని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో కావలి గంజాయికి కేంద్రంగా ఉండేదని ఇప్పుడు గంజాయి రహిత కావలిగా మార్పు చెందిందని, గంజాయి విక్రేతలను సుమారు 40 మందికి పైగా కటకటాల పాలయ్యారని తెలిపారు. కావలి నియోజకవర్గంలో గంజాయిని కూకటి వేళ్ళతో సైతం పేకలిస్తామని తెలిపారు. అనంతరం దగదర్తి జూనియర్ కాలేజీకి అవసరమైన ప్రహరీగోడ, క్రీడా మైదానం చదును, ఇతర సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో బిట్రగుంట జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, దగదర్తి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్. ప్రకాష్ రావు, బోగోలు ఎంఈవో జయమ్మ, దగదర్తి ఎంఈవోలు భాస్కర్, విజయ రత్నం, టీడీపీ బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, దగదర్తి మండల టీడీపీ అధ్యక్షులు అల్లం హనుమంతరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని మర్రిపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మర్రిపాడు మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఫాతిమా బేగం జీవిత చరిత్ర గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మలత ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆవాజ్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రషీద్ చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని మర్రిపాడు మండల ఆవాజ్ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పటాన్ రసూల్ సయ్యద్ కాలేశా సయ్యద్ నాయబ్ షేక్ కాలేషా ఆవాజ్ కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన సమగ్రశిక్ష ఏపీసీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య మర్రిపాడు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. ఈ తరుణంలో విద్యార్థునులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి నాడు నేడు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 ధనలక్ష్మి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

**- మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ చైర్ పర్సన్ షేక్ రబియా**




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నిరుద్యోగులకు రెండు నెలలపాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ చైర్ పర్సన్ షేక్ రబియా చెప్పారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పథకం ఈఈఎల్‌టిపి ప్రాజెక్ట్‌ను నెల్లూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎఫ్ తెగలకు చెంది కనీస విద్యార్హత పదవ తరగతి కలిగి ఉండి ఆసక్తి గల అభ్యర్థులకు ఉచితంగా రెండు నెలలు కంప్యూటర్ శిక్షణనిచ్చి అనంతరం పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్టిఫికెట్ అందజేసి వారికి ఉపాధి కల్పించబడునని తెలిపారు. ఈ కార్యక్రమం హెూటల్ అభిరామి వెనుక భాగంలో సికిందర్ కేఫ్ మిద్దె పైన గల కార్యాలయం నందు జరుగునని తెలియజేశారు. దీనికి సంబంధించి మరిన్ని విషయాల కొరకు క్రింది నెంబర్‌కు 6281259285 సంప్రదించవలసిందిగా కోరారు. పై కార్యక్రమంలో సలీం, అన్నదేవుల సాయి కుమార్ రెడ్డి, షేక్ ఆయేషా, పఠాన్ రఫీ, కల్పలత, మహేష్ కుమార్, షేక్ దాఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులే ధ్యేయంగా పనిచేయాలి : ఎమ్మెల్యే కాకర్ల

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నిర్వహించిన జలదంకి మండల సర్వసభ్య సమావేశంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని అన్ని శాఖల అధికారుల సమస్యలను, వారు చేపట్టిన పనులను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ప్రజల యొక్క అవసరాలను తెలుసుకొని, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజల సమస్యలను సత్వరంగా చర్యలు తీసుకుని పరిష్కరించాలని ప్రజలే దేవుళ్ళు అనే విధంగా వారికి తగు ప్రాధాన్యత ఇచ్చి గౌరవించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో గల డ్రైనేజీ, పారిశుద్ధ్య, త్రాగునీరు సమస్యలను ఒకదాని తర్వాత ఒకటి పరిష్కరించడం జరుగుతుందని, ఇది ప్రజా ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా డాక్టర్ చిల్లూరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో సీనియర్ నాయకుడు, ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, జెసిఎస్ కన్వీనర్, మాజీ జెడ్పిటిసి మెంబర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య వైఎస్ఆర్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమితులయ్యారు. డాక్టర్ ఆదిశేషయ్య 3దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ గతంలో ఆత్మకూరు మండల జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా కాంగ్రెస్ తరపున విజయం సాధించి ఐదేళ్ళపాటు కొనసాగారు. ఆయన గతంలో జిల్లా కాంగ్రెస్ ప్రదానకార్యదర్శిగా వ్యవహరించారు. తెలుగుదేశం ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడుగా కొనసాగారు. 2019 ఎన్నికల సందర్భంగా ఆయన వైసిపిలో చేరి మేకపాటి గౌతంరెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డిల విజయం కోసం తీవ్రంగా కృషిచేశారు. ఆయన ఆత్మకూరు మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. ఆయన సతీమణి చిల్లూరు మంజూషా గతంలో ఎంపిటిసి మెంబర్‌గా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, రాష్ట్ర ఖనిజాభివృద్ధిసంస్థ డైరెక్టర్‌గా కూడా కొనసాగారు. డాక్టర్ ఆదిశేషయ్య రాజకీయానుభవంతో ఆయనతోపాటు ఆయన సతీమణి కూడా పలు పదవులు పొందారు. డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, బొల్లినేని కృష్ణయ్యనాయుడు, ఆనం రామనారాయణరెడ్డిలకు గతంలో అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. దివంగత మంత్రి మేకపాటిగౌతంరెడ్డికి అత్యంత ముఖ్యమైన నాయకుడుగా కొనసాగారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కూడా డాక్టర్ చిల్లూరు అత్యంత సన్నిహితుడుగా కొనసాగుతున్నారు. ఆయన రాజకీయానుభవాన్ని గుర్తించిన వైసిపి అధిష్టానం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమించారు.

## కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన టీడీపీ మండల అధ్యక్షులు అరికట్ల జనార్దన్ నాయుడు చేతులమీదుగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ పేరుతో శనివారం నుండి ప్రభుత్వం కళాశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణ జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇటీవల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకోసం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్టు గుర్తు చేశారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని, మంచి చదువులు చదివి మర్రిపాడు కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ విజలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్లో అన్నదానం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సంవత్సరం క్రితం ఇదే రోజున జరిగిన యాక్సిడెంట్‌లో పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పీఏ వెంకటేశ్వర్లు మరణించిన విషయం తెలిసిందే శనివారం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని క్యాన్సర్ హాస్పిటల్‌లో అన్న ప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ ఎమ్మెల్సీ లిపర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం క్యాన్సర్ హాస్పిటల్లోని బాధితులు, పేషంట్ అటెండర్లకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశర్లు సతీమణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ మస్తాన్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఎనల్ హాస్పిటల్లో గుండె సంబంధిత అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్న వైఎస్ఆర్సిపి నాయకులు లిఅబ్దుల్ మస్తాన్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్బంగా అబ్దుల్ మస్తాన్‌తో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అబ్దుల్ మస్తాన్ ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నాగార్జున, సీనియర్ నాయకులు హంజా హుస్సేనీ, మల్లి నిర్మల, మాబాషా, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు నగర నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ శ్రేణులు, 47 డివిజన్ వైసిపి నాయకులు కార్యకర్తలు, భారీ ఎత్తున కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత ప్రజాదరణ పొంది పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మజ్జిగ జయకృష్ణ రెడ్డి రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

## విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్‌కు శుభాకాంక్షలు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నూతన సంవత్సరం సందర్భంగా విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణని టీచింగ్, నాన్ టీచింగ్ విభాగం వారు శుభాకాంక్షలు తెలియజేశారు. లాంగ్ టర్మ్ డీన్ రామారావు, ఏఓ రాములు, ఏఓ రమేష్ బాబు, ఏఓ ఆదినారాయణ రావు, ఏఓ వినోద్, ఏఓ ప్రశాంత్ కన్నా, ఏఓ సృజల శుభాకాంక్షలు తెలిపారు.

# మధ్యాహ్నభోజనం ప్రారంభం

### ఏవిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ జూనియర్‌కాలేజిల్లో విద్యార్థులకు డక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం ప్రారంభించడం సంతోషదాయకమని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఈపథకం ప్రారంభించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్న అశోక్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం జూనియర్‌కాలేజిల్లో మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రారంభించడాన్ని తాము స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జూనియర్‌కాలేజిల్లో మధ్యాహ్న భోజనపథకాన్ని అమలుచేశారని, అనంతరం వైఎస్‌జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఈ పథకాన్ని రద్దుచేశారని ఆయన పేర్కొన్నారు. జగన్ నిర్ణయంతో ప్రభుత్వ జూనియర్‌కాలేజిల్లో చదువుకునే పేదవిద్యార్థులు మధ్యాహ్నభోజనం లేక తీవ్రంగా ఇబ్బందిపడ్డారని ఆయన పేర్కొన్నారు. మళ్ళీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని పునరుద్ధరించడం హర్షదాయకమన్నారు. గతంలో వైసిపి పాలనలో ఈపథకం రద్దుచేయడానికి వ్యతిరేకంగా తాము ఉద్యమాలు నిర్వహించగా తమపై కేసులుపెట్టారని అశోక్‌రెడ్డి తెలిపారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం జూనియర్‌కాలేజిల్లో డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రారంభించడంపట్ల తమ యూనియన్ తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామని అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

## కాకర్లతో సీతారాంపురం నేతల భేటీ

**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కప్ప ప్రభాకర్ రాజు, సీతారాంపురం సర్పంచ్ కొండవటి కంటి భాగ్య కుమారి, మాజీ మండల సింగల్ విండో ఉపాధ్యక్షులు దేవర వెంకటేశ్వర్లు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు మండలంలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా దేవర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు, కొత్తగా ప్రపోజల్ పెట్టిన సిసి రోడ్లు, మండలంలోని పలు రాజకీయ అంశాలను చర్చించడం జరిగిందని తెలిపారు. సీతారాంపురం పంచాయతీలో ప్రధానంగా ఉన్న మంచినీటి సమస్య, సమ్మర్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం, ఎల్‌విఆర్ కాలేజ్ జంక్షన్ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు రెండు వరుసల రహదారి నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న అలుగు బ్రిడ్జిని కొత్తగా నిర్మిస్తే సీతారాంపురం గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపామని తెలియజేశారు. దీనిపై ఎమ్మెల్యే కాకర సురేష్ సానుకూలంగా స్పందించారని నేషనల్ హైవే అథారిటీతో మాట్లాడి ఈ పనులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## 6వ తేదీన ఎడ్యుకేషన్ ఫెయిర్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో ఈనెల 6వ తేదీన జట్టి శేషారెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ ఆర్గనైజింగ్ కన్వీనర్ వాసుదేవ రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు 15కు పైగా విద్య సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇప్పుడే వచ్చా అసలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి అనేక ప్రముఖ యూనివర్సిటీలు అంతర్జాతీయ మెడికల్ కోర్సులు అందించే కాలేజీలు ఒకే వేదికపై తీసుకురావడానికి గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ కృషి చేస్తుందని అన్నారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో నేరుగా విశ్వవిద్యాలయం సిబ్బందితో మాట్లాడుకునే అవకాశం ఉందని తెలిపారు. వారు అందించే కోర్సులు, ఫీజు, స్ట్రక్చర్, స్కాలర్షిప్, వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం గ్లోబల్ సమ్మిట్ సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆహ్వాన కమిటీ సభ్యుడు నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల సంరక్షణ, విద్యపట్ల జాగ్రత్తలు ఆవశ్యకం : సీడీపీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చిన్నారులు బాల్యారంభదశలో సంరక్షణ, పూర్వప్రాథమిక విద్య పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు పట్టంలోని ఎస్టీకాలనీ, ఎన్‌ఆర్‌పేట, సుందర నగర్, పేరారెడ్డిపల్లి మెయిన్, నెల్లూరుపాళెం ఎస్టీ, మండలంలోని కరటంపాడు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసిసిఏడే కార్యక్రమాలు నిర్వహించగా సిడిపివో సునీలత అతిధిగా పాల్గొన్నారు. ప్రతినెలా 5వతేదీ నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం ఆదివారం కావడంతో శనివారం నిర్వహించారు. చిన్నారులతో రోల్‌ప్లేచేయించారు. వివిద వేషధారణలు గావించి తదనుగుణంగా వ్యవహరింపజేసి వారిలో అవగాహనా శక్తిని పెంపొందించేలా కృషిచేశారు. పూర్వప్రాథమిక విద్యకు సంబంధించి అంశాలను కూడా విద్యార్థులచే ప్రదర్శింపజేశారు. వారి సంరక్షణ పట్ల తల్లిదండ్రులు తగు శ్రద్ధవహించాలని, సునీలత సూచించారు. చిన్నారుల సంరక్షణ విషయమై ఏమాత్రం అశ్రద్ధ చేయరాదని ఆమె కోరారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, తద్వారా వారికి పౌష్టికాహారం, పూర్వప్రాథమిక విద్య లభిస్తాయని సునీలత పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యంపట్ల కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో తగు శ్రద్ధ తీసుకుంటారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.రత్నమ్మ, ఎన్.కేశవ నారాయణమ్మ, ఎన్.నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, వారి తల్లులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ చిల్లూరుకు అభినందనల పరంపర



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వైసిపి ఉపాధ్యక్షుడుగా నియమితులైన మాజీ జెడ్పిటిసి, టిసిఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్యను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనల పరంపర కొనసాగించారు. ఆయన నియామక సమాచారం అందగానే అనేకమంది డాక్టర్ ఇంటికెళ్ళి శాలువాలు, పూల మాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. 14వ వార్డు కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్యయాదవ్, డాక్టర్ అభిమాని రవి మున్నా, వైసిపి నాయకులు, డాక్టర్ అభిమానులు అధికంగా పాల్గొని ఆయనను సన్మానించి అభినందించారు. పలువురు ఆయన అభిమానులు ఆనందోత్సాహంతో స్వీట్లు కూడా పంచిపెట్టారు. డాక్టర్ ఆదిశేషయ్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పధవులు పొందాలని ఆకాంక్షించారు. జిల్లా ఉపాధ్యక్షుడుగా పార్టీబలోపేతానికి డాక్టర్ ప్రత్యకశ్రద్ధతో కృషిచేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షపదవి ఇవ్వడం సంతోషదాయకమని, జిల్లా వైసిపి అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలని పేర్కొన్నారు. తనవంతుగా పార్టీబలోపేతానికి కృషిచేస్తానని డాక్టర్ ఆదిశేషయ్య పేర్కొన్నారు.

# ఐదుమంది మృతుల కుటుంబాలకు కంచి ఆర్థికసాయం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల మృతిచెందిన 5మంది కుటుంబాల వారికి శనివారం నిత్యాన్నదాత, శ్రీసాంబశివచారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి ప్రతినిధులు 10వేల రూపాయలవంతున 50వేల రూపాయలను అందజేశారు. వారు ఆయా కుటుంబాల వద్దకు వెళ్ళి పరామర్శించి తమ వంతుగా 10వేల రూపాయల వంతున ఆర్థిక సాయ మందించారు. గత 15నెలల క్రితం ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌పేషెంట్లు, వారి సహాయకులు, ఇన్‌పేషెంట్ల సహాయకులు దాదాపు ఆరేడువందలమందికి ప్రతినిత్యంత ఉచితంగా అత్యంత రుచికరమైన భోజనాన్ని సమకూరుస్తున్న పరమేశ్వరరెడ్డి ఈ కార్యక్రమాన్ని ఆజన్మాంతం నిర్విరామంగా కొనసాగిస్తామని ప్రకటించి అందుకుగాను హాస్పిటల్ ప్రాంగణంలో దాదాపు 65లక్షల రూపాయలతో భవనం కూడా స్వంతనిధులతో నిర్మించారు. దాంతోపాటు ఆయన సామాజికసేవా కార్యక్రమాలు తమ స్వంత గడ్డపై అందించాలని ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలో ఎవరు మృతిచెందినా ఆ కుటుంబానికి 10వేల రూపాయలవంతున స్వంత నిధులు అందించేలా గత 9నెలలక్రితం ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఆయన స్వంత నిధులతోనే ఒక కైలాస రథయాత్ర వాహనాన్ని, నాలుగు శవశీతలపేటికలను కూడా సమకూర్చారు. నిత్యం జనాలు ఇబ్బందిపడుతున్న దృష్ట్యా ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండు వద్ద, నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై నెల్లూరుపాళెం కూడలి వద్ద తాగునీటిసరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాజాగా ఇటీవల మృతిచెందిన 11వవార్డుపరిధిలోని గొల్లపల్లి నారయ్యకుటుంబాన్ని, 12వ వార్డుపరిధిలో పసుపుల తిరుపతమ్మ కుటుంబాన్ని, 15వవార్డు పరిధిలోని కేల్లూరు పోలమ్మ కుటుంబాన్ని, 16వవార్డు పరిధిలోని షేక్‌రహీమ్‌సాహెబ్ కుటుంబాన్ని, 23వ వార్డులోని షేక్ రియాజ్ కుటుంబాన్ని వారు పరామర్శించి ఆ కుటుంబాలకు 10వేల రూపాయల వంతున ఆర్థిక సాయాన్ని అందజేశారు. కంచిపరమేశ్వరరెడ్డి అందిస్తున్న సామాజికసేవలు అమోఘం, అత్యంత ప్రయోజనకరం, అభినందనీయం అని సర్వత్రా కొనియాడారు. ఆర్థికసాయమందుకున్న మృతుల కుటుంబాలవారు పరమేశ్వరరెడ్డి సేవానిరతిని కొనియాడి ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, పలువురు ఆయా ప్రాంతాల ప్రముఖులు, ట్రస్ట్ ప్రతినిధులు కె.వి.శేషారెడ్డి, అచ్చోలు నారశింహారెడ్డి, మల్లవరపు జయేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బందిసక్రమంగా విధులు నిర్వహించాలి

## ▶ జిల్లా అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వైద్యఆరోగ్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు సేవలందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి, డిటిసివో, క్షయ నివారణాధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలీ సూచించారు. ఆయన శనివారం ఆత్మకూరు పట్టంలోని అర్బన్ పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఆయన ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని, సమయపాలన పాటించాలని, గర్భవతులకు తగిన సేవలందించాలని సూచించారు. వైద్యాధికారిణి తరచూ హాస్టల్స్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని ఆయన సూచించారు. గర్భిణీలు తప్పకుండా ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకునేలా చూడాలని ఆయన కోరారు. మున్సిపల్ పరిధిలో సీజనల్‌వ్యాధులు సోకకుండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ సిద్ధం సుధాకర్, ఎంపిహెచ్‌ఎస్(ఎఫ్) పార్వతి, ఫార్మసిస్ట్ ప్రణతిప్రియ, ఎల్‌టి శ్యామ్, డియివో షేక్ ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూసదస్సులో రైతుల సమస్యలపై ప్రస్థావించిన రైతుసంఘునేత లక్కు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో శనివారం జరిగిన రెవిన్యూ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌రైతుసంఘం మండల ప్రధానకార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ పలు రైతుల సమస్యల గురించి ప్రస్థావించారు. తహాశిల్దారు వి.సుధీర్‌బాబు ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కుప్రసాద్ రైతుల పాస్‌పుస్తకాల్లో నోషనల్‌ఖాతాలు నమోదు గురించి తహాశిల్దారుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. 67వ జాతీయ రహదారి నిర్మాణ సమయంలో రైతులనుండి సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లించని విషయం ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. రైతులనుండి సేకరించిన భూములకు సంబంధించి నిర్వహించిన సర్వేనివేదికను అందజేయాలని ఆయన కోరారు. రైతులకు సంబంధించిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రసాద్ తహాశిల్దారును కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవ వేడుకలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని మండల పరిషత్ వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయిని సీతాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాదేవి ప్రసంగిస్తూ ప్రపంచబ్రెయిలీ దినోత్సవాన్ని ప్రతిఏటా జనవరి 4వతేదీ జరుపుకుంటుంటామన్నారు. లూయిస్ బ్రెయిలీ అనే మహనీయుడి పుట్టినరోజు సందర్భంగా బ్రెయిలీదినోత్సవాన్ని జరుపుకుంటుండడం ఆనవాయితీగా సాగుతుందన్నారు. లూయిస్ బ్రెయిలీలిపిని రూపొందించారన్నారు. బ్రెయిలీలిపి అనేది అంధులు చదవడానికి, రాయడానికి ఉపయోగించే భాష అని ఆమె వివరించారు. పుట్టుకతోకానీ, అనంతరం కానీ కంటిచూపు కోల్పోయినవారు చదువుకు దూరంకాకుండేలా ఈ బ్రెయిలీ లిపిని రూపొందించారన్నారు. ఈసందర్భంగా దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు సీతాదేవి చేతులమీదుగా బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, మంజులవాణి, ధనమ్మ, శశికళ, ఐయిఆర్‌పి జయకుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సేవారంగంలో నైపుణ్యాభివృద్ధితో ఆర్థికంగా ఎదగండి

**- అదనపు కమిషనర్ నందన్**




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** సేవారంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని ఉపాధి అవకాశాలను పెంచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ ఔత్సహిక వృత్తిదారులకు సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 'సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేస్-1ను శనివారం కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో నిర్వహించారు. వృత్తిదారుల రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమంలో అదనపు కమిషనర్ నందన్ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్రంగి సేవలు, ప్లంబింగ్ సేవలు, కార్పెంటర్ సేవలు, గృహోపకారణాల రిపేరింగ్ సేవలు, బ్యూటిషియన్ సేవలు తదితర వృత్తులలో ఉన్నవారికి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా సేవలను అందించనున్నామని తెలిపారు. వృత్తులలో ఉన్నవారికి మెప్మా ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు హౌస్ ట్రయాంగిల్ యాప్ నిర్వహణను నేర్పించి ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వృత్తిదారుల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 7వ తేదీ వరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నామని, ఔత్సహిక వృత్తిదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అదనపు కమిషనర్ సూచించారు. అనంతరం మెప్మా ద్వారా వృత్తిదారుల జీవన ఉపాధిని మెరుగుపరచి వారి ఆర్థిక స్థితిని మార్చడమే ధ్యేయంగా ఆర్పీలు పనిచేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమ్మ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం టీపీఆర్ఓ బాలకృష్ణ, టీఈలు అంకయ్య, కాంతయ్య, సీఏంఏంలు కవిత, జరీనా, సీఓలు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంధుల జీవితాల్లో వెలుగు లూయిస్ బ్రెయిలీ

**మేయర్ స్రవంతి జయవర్ధన్**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** బ్రెయిలీ లిపిని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 4న 'ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం' జరుపుకుంటారని, అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి జయవర్ధన్ స్మరించుకున్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా సమీపంలోని పార్కులో లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి మేయర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బ్రెయిలీ లిపి ఆవిష్కరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంధులు మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారని, అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. బ్రెయిలీ లిపి పేరుతో ప్రింటింగ్, రైటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసిన ఫ్రెంచ్ ఉపాధ్యాయుడు బ్రెయిలీ అని, ఈ లిపిని అంధులు రాయడానికి, చదవడానికి విస్తృతంగా ఉపయోగిస్తారని వివరించారు.

# అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్‌కు అవార్డులు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గ్వాలియర్‌లో జరిగిన 38వ నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ 2024 కన్వెన్షన్‌లో ఎక్సలెన్స్, ఎక్సలెంట్ అవార్డులను శనివారం అదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ కైవసం చేసుకుంది. ఈ విషయాన్ని అధికారులు శనివారం తెలిపారు. గ్వాలియర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదాని కృష్ణపట్నం పోర్టు హాజరు కావడం జరిగింది. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా అటల్ బిహారీ వాజ్‌పేయి-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌తో కలిసి ప్రజలలో పెట్టుబడి పెట్టడం, మంచి భవిష్యత్తును నిర్మించడం అనే థీమ్‌తో వార్షిక ఈవెంట్‌ను నిర్వహించారు. అదాని కృష్ణపట్నం పోర్టు నుంచి రెండు బృందాలు క్వాలిటీ సర్కిల్ కేటగిరీ ఎంట్రీ క్రేన్ యొక్క అప్‌గ్రేడ్ చేసిన మల్టీ-ఆపరేషన్ కైజెన్ కేటగిరీ ఎంట్రీ "క్విక్ రిలీజ్ హుక్ ఫర్ ఎక్స్‌కవేటర్ షిఫ్టింగ్ ఇన్ వెస్సెల్ హచ్"లో దాని ఫ్లాగ్‌షిప్ కేస్ స్టడీస్‌ను ప్రదర్శించడం ద్వారా జాతీయ సమావేశంలో పాల్గొన్నాయి. రెండు ప్రాజెక్ట్‌లు ఈ సంవత్సరం తైవాన్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ క్వాలిటీ సర్కిల్‌కి అర్హత సాధించాయి. అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ జట్టును ప్రశంసించారు.



# పేదలకు అన్నదానం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ 5వ వార్షికోత్సవ సందర్భంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నగరం నందు బోడిగోడ తోట సమీపంలో 200 మందికి పైగా పేదలకు విశేష అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. అదేవిధంగా నేడు జరగబోయే మెగా రక్తదాన శిబిరానికి ప్రతి ఒక్కరూ పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు కోగిలి రమేష్ రాజు, అధ్యక్షులు ముని వెంకట సూర్య, ఉపాధ్యక్షులు కాళహస్తి సుధాకర్, ట్రెజరర్ కమల్ నాథ్, సభ్యులు శ్రీకాంత్, ధనలక్ష్మి, సురేష్, నరేష్, యశ్వంత్, సాయితేజ, సాయిరెడ్డి, అఖిల, ప్రశాంత్, అభిషేక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి దినపత్రిక సూర్య



## విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాళెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

**నేటి దినపత్రిక సూర్య కార్యాలయం**
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

**9000118811, 9963827227**

## శ్రీరామ పట్టాభిషేకం అవతారంలో..



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం నందు పగల్ పత్తు ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం 5వ ఉత్సవం అయిన శ్రీరామ పట్టాభిషేకం అవతారంలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ రంగనాథ స్వామి వారు కనివిందు చేయడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ఉభయదాత కీ శే చుండూరు రామయ్య, చుండూరు వారి వారసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంకు ఆలయ ఈఓ శ్రీ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన చైర్మెన్ శ్రీ మంచికంటి శ్రీనివాసులు, దేవస్థాన సిబ్బంది కార్యక్రమం నందు పాల్గొనడం జరిగిందని తెలిపారు.

## త్రివిక్రమ అవతారంలో వేణుగోపాలుడు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మూలాపేటలో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం స్వామిపగల్ పత్తు ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు స్వామి వారు త్రివిక్రమ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంకు ఉబాయకర్తగా మామిడి ఆంజనేయులు శ్రేష్టి, శ్రీ మామిడి హజరత్ శ్రేష్టి వ్యవహరించారు. కార్యక్రమంను ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళి రెడ్డి,సహాయక కమిషనర్, కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాస్ రావు పర్యవేక్షించారని సిబ్బంది తెలిపారు.

## మా కుటుంబానికి న్యాయం చేయండి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం మన్నవరపాడు గ్రామ నివాసి కూకటి సుజాత తనకు సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన తులసి తిరుమలేష్ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. శనివారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఒక వ్యక్తి తమ భూమిని లాక్కోవడమే కాకుండా, పోలీస్ వాళ్ళు తన ఇంటి దగ్గరకు వచ్చి పోలీస్ స్టేషన్ రావాలని రోజు వేధిస్తున్నారని కావున తమ కుటుంబానికి జిల్లా కలెక్టర్, అధికారులు రక్షణ కల్పించాలని కోరారు.